# ప్రపంచంలో ఏడో ఆర్థికశక్తిగా భారత్!

ఈనాడు - హైదరాబాద్

జనధన యోజన చరిత్ర సృష్టించిందని, అనతికాలంలోనే 11.5కోట్ల మంది బ్యాంకు ఖాతాదారులయ్యారని కేంద్ర పట్టణాభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి వెంకయ్యనాయుడు తెలిపారు. ఐఎంఎఫ్ నివేదిక ప్రకారం త్వరలోనే భారత్ ప్రపంచంలో ఏడో ఆర్థికశక్తిగా ఎదుగుతుందని, దానికి ఇటీవల ఒబామా పర్యటనే చక్కని ఉదాహరణగా పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ఆదివారం జరిగిన 56వ నేషనల్ కాస్ట్ కన్వెన్షన్ ముగింపుసభలో ఆయన మాట్లాడారు. 2015కు గాను జీడీపీ 6.3శాతంగా నమోదవుతుందని, 2016లో చైనాను అధిగమించి 6.5కు చేరుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా స్మార్ట్‌సిటీల నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేస్తామన్నారు. పదేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి సెలవు తీసుకుందని, ప్రధాన మంత్రి మోదీ వాటన్నిటినీ సరిచేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారని తెలిపారు. అగ్రరాజ్యాల సరసన భారత్‌ను చేర్చేందుకు ప్రధానితో సహా మంత్రివర్గమంతా అవిశ్రాంతంగా శ్రమిస్తున్నట్లు తెలిపారు.



హైదరాబాద్‌లో 'ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' సదస్సులో సావనీర్‌ను విడుదల చేస్తున్న కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు. చిత్రంలో ఐసీఏఐ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు పీవీ భట్టడ్, ఛైర్మన్ మధుసూదన్‌రావు తదితరులు

కొందరు అనవసరంగా రాజ్యాంగ ప్రవేశికలోని సెక్యులరిజం, సోషలిజంపై అనవసర రాద్ధాంతం చేస్తున్నారన్నారు. లౌకికత్వం, సామ్యవాదం భారతీయుల రక్తంలో ఉన్నాయని, వాటిని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అవసరంలేదని సూచించారు.

**మహిళలు గొప్ప అకౌంటెంట్లు..:** భారతీయ మహిళలు పొదుపు విషయంలో ఎంతో నేర్పుగలవారని, ఆర్థిక వ్యవహారాల్లో ఆచితూచి వ్యవహరిస్తారని వెంకయ్యనాయుడు తెలిపారు. నిర్మాణాల్లో ఖర్చులను ఏవిధంగా తగ్గించుకోవాలనేది వారికి బాగా తెలుసన్నారు. ఇంజినీరింగ్ పనుల్లో ఖర్చు విపరీతంగా పెరుగుతోందని, వ్యయం, డిమాండ్, సరఫరా మధ్య సానుకూల వ్యత్యాసం ఉండటం లేదన్నారు. సీఎంఏ (సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్)లు దానిని లాభదాయకంగా మార్చే ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పీపీపీ విధానంతో పట్టణాల్లో విద్య, రవాణా, ఆర్థికాభివృద్ధి, ప్రజారక్షణ, ఆరోగ్యం, సామాజికసేవలు మెరుగవుతాయన్నారు.

## ఆప్, కాంగ్రెస్‌ల ఓటమి ఖాయం..

కేంద్రంలో బలమైనశక్తిగా ఉన్న భాజపాను దిల్లీ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారని తెలిపారు. కాంగ్రెస్, ఆప్‌ల ఓటమి ఖాయమన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెన్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో స్మార్ట్‌సిటీల నిర్మాణానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటామన్నారు. కార్యక్రమంలో ఐసీఏఐ ఉపాధ్యక్షుడు పీవీ భట్టడ్, ఛైర్మన్ మధుసూధన్‌రావు పాల్గొన్నారు.